క్లుప్తంగా

బీచ్‌లో వ్యర్థాల తొలగింపు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో శనివారం పార్లే సహకారంతో ఎండాడకు చెందిన అథ్లెటిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తీరంలోని పాలిథిన్ సంచులు, ఇతర వ్యర్థాలను తొలగించారు. అసోసియేషన్ సెక్రటరీ రాజేశ్వరరెడ్డి, సీతామహాలక్ష్మి, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయానికి భారీగా భక్తులు



శ్రీవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శ్రీవారికి ప్రీతికరమైన రోజు శనివారం కావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు వందలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సాయంత్రం నిర్వహించిన కోలాటాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో భద్రతా చర్యల్లో భాగంగా కొన్ని ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి నో స్విమ్మింగ్ జోన్ (ఇచ్చట ఈత కొట్టరాదు) అనే హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. వీటి వల్ల ప్రమాదకర ప్రాంతాలను పర్యాటకులు గుర్తించే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే పర్యాటకులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసేందుకు జీవీఎంసీ లైఫ్ గార్డ్స్, మెరైన్ పోలీస్‌లు, రిప్ కరెంట్ అలెర్ట్ సిస్టం ఉన్నాయని పేర్కొన్నారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి

పద్మనాభం: రీ సర్వేకు రైతులు సహకరించాలని ఇన్‌చార్జి తహసీల్దార్ కోరాడ వేణుగోపాలరావు కోరారు. మండలంలోని విజయరాంపురం, జానకీదేవిపురం గ్రామాల్లో శనివారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయరాంపురం, జానకీదేవిపురం గ్రామాల్లో సోమవారం నుంచి భూముల రీ సర్వే ప్రారంభిస్తామన్నారు. సర్వేలో అనుభవదారులను గుర్తిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌డీటీ కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

ఒత్తిడి అధిగమిస్తే విజయం

పద్మనాభం: ఒత్తిడిని అధిగమిస్తే విజయం తథ్యమని న్యూరో సైక్రియాటిక్ జె.రమేష్ సూచించారు. పద్మనాభం కస్తూర్బా విద్యాలయంలో శనివారం మానసిక ధైర్యం, చదువులో ఉత్తీర్ణత, పరీక్షల్లో విజయం, బాలికల వికాసం వంటి అంశాలపై చిట్కాకులు నేర్పారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పరీక్షలు రాసేటప్పుడు ఒత్తిడి, భయానికి గురికాకూడదన్నారు. చదివేటప్పుడు వచ్చే తలనొప్పి, మైగ్రేన్‌ను అధిగమించడంపై అవగాహన కల్పించారు. ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం మండల అధ్యక్షుడు రాలి అప్పారావు, ఎం.వి.రమణ, కె.నాయుడు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు పాదపూజ

మధురవాడ: బక్కన్నపాలెం రోడ్డులోని శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్లో శనివారం కుటుంబ ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పాద పూజ చేశారు. పిల్లలకు విద్యతోపాటు నైతిక విలువలు, మానవీయ విలువలు అవసరమని వక్తలు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ సందీప్, రీజినల్ ఇన్‌చార్జి అహమ్మద్ ఆలీ, కో ఆర్డినేటర్ రాజేశ్, వైస్ ప్రిన్సిపాల్ ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్లపైనే వాహనాల తిష్ట



వేములవలస ప్రధాన రహదారి పక్కన నిలిపివేసిన లారీలు



పెందుర్తి మార్గంలో రోడ్డుపై నిలిపిన ఆటోలు

- ఇష్టారాజ్యంగా భారీ లారీలు, ఆటోల నిలిపివేత
- వాహన చోదకులకు, గ్రామస్తులకు అవస్థలు

ఆనందపురం : ఆనందపురం జంక్షన్‌లోని రోడ్లపై వాహనాలను ఇష్టారాజ్యంగా నిలిపివేస్తున్నారు. దీంతో వాహన చోదకులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆనందపురం జంక్షన్‌లో ఫ్లై ఓవర్ కింద ఖాళీగా ఉండడంతో వాహనాలను నిలిపివేస్తున్నారు. దీంతో మూడు మార్గాల నుంచి వచ్చే వాహనదారులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు రోడ్డు మార్జిన్‌లో భారీ లారీలు, వ్యాన్‌లు, ఆటోలు ఎక్కడబడితే అక్కడే నిలిపి వేస్తున్నారు. ముఖ్యంగా విశాఖ, పెందుర్తి, విజయనగరం, శ్రీకాకుళం నుంచి వచ్చే లారీలు, ఇతర భారీ వాహనాలను జంక్షన్‌లోని వేములవలస గ్రామం ప్రధాన రోడ్డుకు ఇరువైపులా నిలిపి వేస్తున్నారు. దీంతో గ్రామస్తులు రాకపోకలు సాగించడానికి ఇక్కట్లు పడుతున్నారు. సాయంత్రం వేళ పాఠశాల బస్సులు పిల్లలను తీసుకొచ్చే సమయంలో రోడ్లపై వాహనాలు నిలిపి వేసి ఉండడంతో ట్రాఫిక్ గజిబిజిగా మారుతోంది. అలాగే పూల మార్కెట్ పక్క నుంచి పెందుర్తి వెళ్లే సర్వీసు రోడ్డు పక్కనే ఆటోలు, వ్యాన్‌లు పార్కింగ్ చేస్తున్నారు. దీని వల్ల ఉదయం పూట ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అడ్డదిడ్డంగా నిలిపే వాహనాలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కలిసికట్టుగా పనిచేస్తే సుధాకర్‌దే గెలుపు

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



చంద్రంపాలెంలో పట్టభద్రులకు కరపత్రాలు పంచుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



చిట్టివలస హైస్కూల్‌లో ఉపాధ్యాయులను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: అందరూ కలిసికట్టుగా పని చేస్తే వైఎస్సార్‌సీపీ బలపరచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ ఖచ్చితంగా గెలుస్తారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ పరిపాలనా రాజధాని అవుతున్న తరుణంలో ఈ ఎన్నికను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారన్నారు. రెండు రోజులుగా నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో రూ.13 లక్షల పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావడం చారిత్రక పరిణామమన్నారు. సమ్మిట్ విజయవంతంతో ఈ ప్రాంతం గొప్పదనం, సీఎం జగన్ ప్రతిష్ట భారీగా పెరిగిపోయాయని... ఈ తరుణంలో ఎమ్మెల్సీ గెలుపు చాలా కీలకమన్నారు. నియోజవర్గ పార్టీ పరిశీలకులు పి.బాలరాజు మాట్లాడుతూ సీఎం జగన్ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేసి సుధాకర్ గెలుపును కానుకగా ఇవ్వాలని కోరారు. ఎంపీపీలు దంతులూరి వాసురాజు, కంటుబోతు రాంబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు పాల్గొన్నారు.

గత ప్రభుత్వాలు ఉత్తరాంధ్రను విస్మరించాయి

తగరపువలస: గత ప్రభుత్వాలు ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఏమీ చేయలేదని, వారికి ఇక్కడి ప్రజలను ఓటు అడిగే హక్కు లేదని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శనివారం సాయంత్రం నియోజకవర్గ పరిశీలకుడు పి.బాలరాజుతో కలిసి చిట్టివలస జెడ్పీ బాలుర, బాలికల హైస్కూళ్లలో ఉపాధ్యాయులను కలిసి వైఎస్సార్‌సీపీ బలపరచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మఒడి పథకం ద్వారా నాలుగేళ్లలో రూ.2400 కోట్లు తల్లుల ఖాతాలకు జమ చేయడమే కాకుండా నాడు – నేడు పథకంతో వసతుల కల్పనకు రూ.50 వేల కోట్లు ఖర్చు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఒకవైపు గిరిజన ప్రాంతం, మరోవైపు తీరప్రాంతం కలిగి ఉన్న విశాఖను పరిపాలన రాజధానిగా ముందుకు తీసుకెళ్తున్న సీఎం జగన్‌కు మద్దతుగా సుధాకర్‌కు ఓటు వేయాలని కోరారు. అక్కరమాని రామునాయుడు, తమ్మిన రామలక్ష్మణ, జీరు వెంకటరెడ్డి, ఉప్పాడ నాగేశ్వరరావు, కొప్పల రమేష్, జీరు సుజాత, చిల్ల గణేష్, చింతగుంట శివ, కుమిలి సూర్యనారాయణ, తమ్మిన నరసింగరావు పాల్గొన్నారు.

- జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట, కొత్తపేటలో కొప్పల ప్రభావతి, జీవీ రమణ, భాగం గోపాల్, సిమ్మల ప్రసన్న, తమ్మిన కూర్మారావు, నీలాపు రామిరెడ్డి, కుంచా శివరామకృష్ణ, పందిరి విజయ్, దుంప సాయిరెడ్డి, లెంక రమేష్, కొప్పల కృష్ణ తదితరులు సుధాకర్ తరఫున ప్రచారం చేశారు.
- జీవీఎంసీ రెండో వార్డు చిల్లపేట, జీరుపేట, రాయపాలెం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి శిల్లా కరుణాకరరెడ్డి, అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, చిప్పాడ వెంకటేష్, మునకాల ఆదినారాయణరెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి, సరగడ శివాంజనేయరెడ్డి, చిలల సూరినరసయ్యరెడ్డి, డెక్కతి శ్రీనివాసరెడ్డి తదితరులు ప్రచారం చేశారు.



ఒకటో వార్డులో ప్రచారం చేస్తున్న అక్కరమాని రామునాయుడు, కొప్పల ప్రభావతి తదితరులు

మధురవాడ: సీతంరాజు సుధాకర్ గెలుపు ఉత్తరాంధ్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని, ఆయన విజయానికి అంతా సహకరించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. కొమ్మాది శ్రీ చైతన్య కళాశాల, కొమ్మాది రిక్షా కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సీవోఈ తదితర విద్యాసంస్థలు, పరిసర ప్రాంతాలలో శనివారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోగాపురం ఎయిర్‌పోర్టు, కారిడార్ రోడ్డు వంటివి వస్తున్నాయని చెప్పారు. విశాఖ అభివృద్ధి మన అందరి చేతుల్లో ఉందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షులు బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, సింహాచలం ట్రస్ట్ బోర్డు సభ్యులు పీకేఎమ్ పాత్రుడు, కుడితి రామారావు, పిళ్లా సూరిబాబు రాయిన సాయి, గుంటబోయిన సంజీవ్ యాదవ్ పాల్గొన్నారు.

మధురవాడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కి మద్దతుగా వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం సాయంత్రం చంద్రంపాలెం పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సీటు గెలిపించి సీఎం జగన్‌కు కానుకగా ఇవ్వాలని కోరారు. 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, పిళ్లా సూరిబాబు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెంద్ర అప్పన్న, చేకూరి రజని, పిళ్లా అప్పన్న పాల్గొన్నారు.

నృత్యకారిణి గీతా సాయికి సన్మానం



గీతా సాయి ప్రసూలను సన్మానిస్తున్న ఎంపీపీ రాంబాబు తదితరులు

పద్మనాభం: అనంతుని కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి భరతనాట్యం అద్భుతంగా ప్రదర్శించిన మద్ది గ్రామానికి చెందిన మొకర గీతా సాయి ప్రసూలను ఎంపీపీ కంటుబోతు రాంబాబు, ఈవో ఎస్.నానాజీ బాబు సన్మానించి మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, తాలాడ పద్మనాభం, కంటుబోతు ఎర్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికలతో ప్రమాదాల నివారణ



దివీస్‌లో భద్రతా వారోత్సవాలు ప్రారంభిస్తున్న అగ్నిమాపకశాఖ డైరెక్టర్ జనరల్ సంజయ్

తగరపువలస: ప్రమాదాల నివారణకు ముందస్తు ప్రణాళిక, సమగ్ర శిక్షణ అవసరమని రాష్ట్ర విపత్తులు, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ ఎన్.సంజయ్ అన్నారు. భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీలో 52వ జాతీయ భద్రతా దినోత్సవాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంస్థలో భద్రత కోసం యాజమాన్యం తీసుకుంటున్న చర్యలు బాగున్నాయన్నారు. అనంతరం భద్రతా ర్యాలీని అగ్నిమాపకశాఖ డైరెక్టర్ పీవీ రమణతో కలిసి ప్రారంభించారు. కర్మాగారంలో అమలు చేస్తున్న భద్రతా పరికరాల ప్రదర్శనను అడిషనల్ డైరెక్టర్ జి.శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ అగ్నిమాపక శాఖ అధికారి డి.నిరంజన్‌రెడ్డి, జిల్లా అధికారి జె.మోహన్‌రావు, దివీస్ డైరెక్టర్ దివి మధుసూదనరావు, వైస్ ప్రెసిడెంట్లు ఎస్.దేవేంద్రరావు, ఎల్‌వీ రమణ, జనరల్ మేనేజర్లు వైఎస్ కోటేశ్వరరావు, కె.సుబ్బారావు, ఎం.ఎస్.ఎన్.రావు, భద్రత అధికారులు ఎం.చంద్రశేఖర్, ఐ.ఎల్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లబోధన ఎంతో కీలకం

భీమునిపట్నం: విద్యార్థులకు ఆంగ్లబోధన ఎంతో కీలకమని జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) అధ్యాపకులు జీజీఎస్ నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్లం బోధించే ఉపాధ్యాయులతో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విద్యావిధానంతోపాటు, ఉద్యోగాలు పొందాలన్నా ఆంగ్లం ఎంతో ముఖ్యమైందన్నారు. ఈ విషయంలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఇప్పటి నుంచే భాషపై మంచి పట్టు వచ్చే విధంగా బోధించాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.శివరాణి, సిబ్బంది పాల్గొన్నారు.

విజయానందపురం హైస్కూల్ పరిశీలన

పద్మనాభం: మండలంలోని విజయానందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను భీమునిపట్నం డైట్ లెక్చరర్ సరిపల్లి త్రినాథ్ శనివారం పరిశీలించారు. ఉపాధ్యాయుల డైరీలు, లెసన్ ప్లాన్లు పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు పదికి పది పాయింట్లు సాధించడానికి సలహాలు, సూచనలు అందించారు. సీ, డీ గ్రేడ్ విద్యార్థుల స్థితిని మెరుగుపరచడానికి సూచనలు చేశారు.

ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆక్రమించారంటూ ఫిర్యాదు

పద్మనాభం: శిర్లపాలెం నుంచి పద్మనాభం వెళ్లే మార్గంలో చెరకు కాటా వద్ద ఆర్‌అండ్‌బీకి చెందిన రోడ్డు స్థలాన్ని వెన్ని అప్పారావు, మరి కొంతమంది ఆక్రమించి శాశ్వత భవనాలు నిర్మించారని ఆ శాఖ ఈఈకి మద్ది గ్రామానికి చెందిన బుగత వెంకటరావు, కనకల శ్రీను ఫిర్యాదు చేశారు. ఆర్‌అండ్‌బీకి చెందిన స్థలంలో శాశ్వత భవనాలు నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రమాదకరంగా ఆట వస్తువులు



సంగివలస దివీస్ పార్కులో శిథిలమైన ఆట వస్తువులు



పార్కులో విరిగిపోయిన ఊయల

తగరపువలస: జాతీయ రహదారిని ఆనుకుని సంగివలస దివీస్ పార్కులో ఏర్పాటు చేసిన ఆట వస్తువులు శిథిలమైపోయి చిన్నారుల పాలిట శాపంగా మారాయని జాతీయ మానవ హక్కుల సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శీరపు రామలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్ల క్రితం రూ.2.25 కోట్లతో దివీస్ సంస్థ ఏర్పాటు చేసిన పార్కు ఆకతాయిలకు, జూదరులకు అడ్డాగా మారిపోయిందన్నారు. దివీస్ యాజమాన్యమే జోక్యం చేసుకుని శిథిలమైన ఆట వస్తువులను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని.., నిర్వహణకు సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. వాకింగ్ ట్రాక్, సిమెంట్ బెంచీలు పునరుద్ధరించాలని కోరారు.

నేటి నుంచి పోలమాంబ అమ్మవారి ఉత్సవాలు



సంగివలసలోని ముగ్గురు అమ్మవార్లు

తగరపువలస: సంగివలస పోలమాంబ (కొత్తమ్మవారు అని పిలిచే ముగ్గురు అమ్మవార్ల) ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నట్టు ఈవో పి.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. జాతీయ రహదారిని ఆనుకుని సర్వీస్ రోడ్డు ముందు అమ్మవార్ల ఆలయం ఉండడంతో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని దివీస్ పార్కు లోపల నుంచి క్యూలైన్లు ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. తొలిరోజైన ఆదివారం మరిడిమాంబ ఉత్సవం, సోమవారం పోలమాంబ, ముత్యమాంబ ఉత్సవాలు నిర్వహించి చివరి రోజైన మంగళవారం అమ్మవార్ల అనుపు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మూడు రోజులు ఆలయ ఆవరణలో పౌరాణిక, జానపద కార్యక్రమాలు నిర్వహించి మంగళవారం అనుపు సందర్భంగా పులివేషాలు, తప్పెటగుళ్లు, నవదుర్గ అమ్మవార్ల వేషాలు ప్రదర్శించనున్నారు. ఈ నెల 15న అన్నదానం ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగస్వాములవ్వాలి అనుకునేవారు 99519 58933,79972 04589లో సంప్రదించాలని కోరారు.

చట్టాలపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు

భీమునిపట్నం: చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్ పి.నాగేశ్వరరావు సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భీమిలి మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదైనా సమస్య ఎదురైతే చట్టం ద్వారా ఎలాంటి పరిష్కారం లభిస్తుందన్న విషయాలు తెలుసుకోవాలన్నారు. చట్టాలు, న్యాయస్థానాల్లో సరైన న్యాయం లభించదన్న అపోహలు చాలా మందిలో ఉన్నాయని, అందులో నిజం లేదన్నారు. బాధితులందరికీ తప్పకుండా న్యాయం జరుగుతుందన్నారు. ఇటీవల కాలంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న కేసులు ఎక్కువగా వస్తున్నాయని, వారిలో యువత చాలా మంది ఉంటుండడం దురదృష్టకరమన్నారు. ఈ విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, పిల్లలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా చూడాలని సూచించారు. రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ పవన్‌కుమార్ మాట్లాడుతూ మహిళల భద్రత కోసం అనేక చట్టాలు ఉన్నాయన్నారు. వారిని ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వేధింపులు ఎదురైతే విద్యార్థినులు తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.మంజుల, లీగల్ సెల్ చైర్మన్ ఆర్.ఉమామహేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈవో కేఏ బాలామణి

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు జేవీ అగ్రహారంలో గల ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఎంఈవో కేఏ బాలామణి శనివారం పరిశీలించారు. భోజనం నాణ్యతను పరిశీలించి అక్కడి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం మాట్లాడుతూ జగనన్న విద్యా కానుకలు ప్రతి ఒక్కరి దగ్గర ఉండాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల వర్కు పుస్తకాలను ఆమె పరిశీలించారు. పరీక్షలు సమీపిస్తున్నందున ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

నేడే అనంతుని తెప్పోత్సవం



తెప్పోత్సవానికి సిద్ధం చేసిన కోనేరు

పద్మనాభం: అనంతుని కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం తెప్పోత్సవం నిర్వహించనున్నారు. 50 ఏళ్ల క్రితం ఉత్సవాన్ని నిర్వహించేవారు. తర్వాత ఉత్సవం మరుగునపడింది. దీంతో ఉత్సవ కమిటీ తెప్పోత్సవాన్ని పునరుద్ధరించేందుకు ముందుకు వచ్చింది. ఇందుకు అవసరమయ్యే అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. విజయనగరం – కొంత్యాం ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన పద్మనాభం జంక్షన్ సమీపంలో ఉండే అనంతుని కోనేరును నీటితో నింపారు. చుట్టూ లైటింగ్ ఏర్పాటు చేశారు. ఉత్సవం నిర్వహణకు విజయనగరం జిల్లా చింతలవలసలోని వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి తెప్పను తీసుకొచ్చారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ కుంతీ మాధవ స్వామి ఆలయం నుంచి శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలను కోనేరు వద్దకు తీసుకొచ్చి తెప్పోత్సవం కనుల పండువగా నిర్వహించనున్నారు.